
హ్యాపీ న్యూ ఇయర్





కేకులతో మహిళలు



కేకు దుకాణం వద్ద కొనుగోళ్ల సందడి



వివిధ ఆకృతుల్లో తయారు చేసిన కేక్‌లు



కేక్‌లు కొనుగోలు చేసేందుకు గుమిగూడిన జనం

- ఉత్సాహంగా నూతన సంవత్సరం వేడుకలు
- స్వీట్లు, కేక్‌లు, బొకేలు, పూలదండల దుకాణాల్లో సందడి
- పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్న యువత

కర్నూలు (కల్చరల్), డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభ వేడుకలను జిల్లా వాసులు ఆదివారం అర్ధరాత్రి ఘనంగా ప్రారంభించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆహ్వానించారు. విశ్వవ్యాప్త వేడుక కావడంతో కులమతాలకు అతీతంగా ఆబాల గోపాలం ఈ వేడుకల సంబరాల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లోని బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, వీధుల్లో సామూహికంగా వేడుకలను నిర్వహించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సర స్వాగత వేడుకలు మిన్నంటాయి. కేక్‌ను కట్ చేసి పరస్పరం పంచుకుంటూ సంతోషంగా గడిపారు. తీపి చేదు కలయికలతో, కొందరికి సంతోషాన్ని, మరికొందరికి దుఃఖాన్ని, కొందరికి విజయాన్ని, మరికొందరికి వైఫల్యాలను పంచిన 2023 సంవత్సరానికి సెలవు పలుకుతూ కోటి ఆశలు, కొంగొత్త ఊసులతో 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. కొత్త ఏడాదిలో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ కేక్‌లు, మిఠాయిలతో నోటిని తీపి చేసుకున్నారు. కొత్త సంవత్సర ఆరంభ సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్ల దుకాణాలు సందడిగా కనిపించాయి. కేక్‌లు, స్వీట్ల కొనుగోళ్లకు ప్రజలు ఉత్సాహం చూపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు 'కొత్త సంవత్సర శుభాకాంక్షలు' తెలిపేందుకు బొకేలు, పూల దండలు కొనుగోలు చేయడం కనిపించింది. నగరంలో కొత్త సంవత్సర ఆరంభ వేడుకల్లో యువత సందడి చేశారు. ఆదివారం రాత్రి బైక్‌లపై తిరుగుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అర్ధరాత్రి వివిధ కూడళ్లలో యువత కేక్‌లు కట్ చేసుకొని పరస్పరం కేక్‌లను అందించుకూంటూ ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. నగరంలో ఎలాంటి అపశ్రుతులకు చోటు లేకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల సందడి

నగరంలో వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ వేడుకలు జరుపుకున్నారు. అపార్ట్‌మెంట్లు, వివిధ కాలనీల్లో స్టేజ్‌లను ఏర్పాటు చేసి, మ్యూజిక్ సిస్టమ్స్‌తో పాటలకు నృత్యాలు చేశారు. మహిళలు, చిన్న పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాలలు, కళాశాలల్లో శనివారం సాయంత్రమే నూతన సంవత్సర ఆరంభ వేడుకలు నిర్వహించి కేక్‌లు పంపిణీ చేశారు.

చర్చిలలో నూతన సంవత్సర స్వాగత ప్రార్థనలు

కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ నగరంలోని వివిధ చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కొన్ని చర్చిలలో కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిల పాస్టర్లు, మత పెద్దలు దైవ సందేశాన్ని అందజేశారు. క్రీస్తు మార్గంలో కొత్త సంవత్సరంలో సంతోషకరమైన జీవితం గడపాలని ఉద్బోధించారు.





అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూల దండలు, బొకేలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

- 20వ రోజుకు చేరిన సమ్మె

కర్నూలు(హాస్పిటల్), డిసెంబరు 31: అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్షలు నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో కొనసాగుతున్నాయి. ఆదివారం అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి హెచ్. తిమ్మన్న, గోకారి, బాలయ్య, ఎస్.నారాయణ స్వామి, సురేష్ శేఖర్, అవాజ్ నగర కమిటీ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ మద్దతు తెలిపారు.



దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

వైభవంగా నవరత్నాల రథోత్సవం

మంత్రాలయం, డిసెంబరు 31: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం ధనుర్మాస చవితి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. రథం ముందుకు సాగుతుండగా జయధ్వనులు పలుకుతూ ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. 2023 ముగింపు రోజున ఆదివారం వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్, మహా ముఖద్వారం, నదీతీరం, రాఘవేంద్ర సర్కిల్ మంత్రాలయం సందడిగా మారింది. రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించే అన్నదానానికి బెంగళూరుకు చెందిన ఇద్దరు అజ్ఞాత భక్తులు రూ.2 లక్షలు, గో సంరక్షణకు రూ.1.50 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టని సీఎం



గూడూరులో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

గూడూరు డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమస్యలు సీఎంకు పట్టడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం కోసం మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె గూడూరులో ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం గూడూరులోని పాత బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారానికి గత్యంతరం లేక సమ్మె చేస్తోంటే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్, అధికారులతో బయటి వ్యక్తులను పిలిచి పనులు చేయించడానికి చూడటం రాష్ట్ర ప్రభుత్వాని సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతన్న, దానమన్న, మనోహరమ్మ, గ్రేసమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం



వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతి పత్రం

గూడూరు డిసెంబరు 31: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. ఆదివారం గూడూరులో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 20 రోజులకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్మికులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యాక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాళ్ళు అరుణ, ఇందుమతి, మద్దమ్మ, రత్నమ్మ, సరోజమ్మ, మంజుల, కళావతి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సి. బెళగల్, డిసెంబరు 31: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీతామాధూరిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్రేవుల గ్రామ పంచాయతీ అవరణలో సర్పంచ్ రెడ్డిగారి మాధవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రం అందించే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), డిసెంబరు 31: ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని ఉద్యోగులు డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక ధర్నా చౌకులో ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న ఆందోళనలు ఆదివారం 13 రోజుకు చేరుకుంది. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జే.నాగేశ్వర రావు, సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ రాజు, కార్యదర్శులు రంగన్న, జిల్లా నాయకులు రఫీ, శంకర్, రమణ, వెంకట్రాముడు, మధుమోహన్, రమణ, సత్యమ్మ, కేజీబీవీ సంఘం నాయకులు ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షకు ఎస్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న మద్దతు తెలిపారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన బస్సు

కోడుమూరు (రూరల్), డిసెంబరు 31: ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదోని డిపో చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి సుమారు 55 మంది ప్రయాణికులతో బయల్దేరింది. అయితే కోడుమూరు దాటిన తర్వాత సాయంత్రం నిలిచిపోవడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. అందులోని ప్రయాణికులను తర్వాత వచ్చే డిపో బస్సుల్లో గమ్యస్థానాలకు పంపారు. కొందరు ప్రయాణికులు సుమారు అరగంటకు పైగా వేచి ఉన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఆలూరు డిసెంబరు 31 : వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యం అని మాజీ ఎమ్మెల్యే, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం నవరత్నాలు మేనిఫెస్టోల 730 హామీల అమలు చేయకుండా జగన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని కోట్ల సుజాతమ్మ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ రెడ్డి నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. జగన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన 730 హామీలలో కేవలం 109 హామీలు అమలు చేసి వంద శాతం అమలు చేశామని ప్రతి సభలో అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డి ఓటు అనే ఆయుధంతో ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు.

జీతాలు చెల్లించాలి

ఆదోని (అగ్రికల్చర్) డిసెంబరు 31 : కొత్త ఏడాది నుంచైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే ప్రభుత్వం జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు తాయప్ప కోరారు. ఆదివారం ఆపాస్ కార్యాలయంలో డైరీని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎజడేషా, భైరప్ప, ఎంపీ శ్రీనివాసులు, ప్రతాప్ సూర్య పాల్గొన్నారు.



వైసీపీని ఇంటికి సాగనంపుదాం

ఆదోని, డిసెంబరు 31 : సొంతింటి కల నెరవేరుస్తామని ఇచ్చిన హామీని విస్మరించిన వైసీపీని ఇంటికి సాగనంపుదామని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎం. తాహేర్ వలి, నాయకుడు పులిరాజు అన్నారు. అదివారం మండలంలోని బసాపురం గ్రామంలో జనసేన, టీడీపీ పొత్తును ఆశీర్వదించండి అనే కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు, మురికి కాలువలు వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పేర్కొంటున్నట్లు గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న కాలనీ నాలుగు వరుసల ఇటుక కట్టడాలు మాత్రమే జరిగాయని అన్నారు. గడపగడపకు వెళ్తున్న సాయి ప్రసాద్ రెడ్డి మాత్రం 99 శాతం వరకు నవరత్నాలు అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంతేష్, అయ్యప్ప, ప్రకాష్, మల్లికార్జున, రమేష్, విగ్నేష్, శ్రీనివాసన్, వీరేష్, తిమ్మప్ప, ఈరన్న గంగాధర్, రాఘువీరా, ఉరుకుంద, రాజు, తాయప్ప, లక్ష్మన్న, నాగరాజు, చంద్ర పాల్గొన్నారు.

చంద్రన్నతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, డిసెంబరు 31 : రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయటపడి అభివృద్ధి పథంలో నడవాలంటే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మైనార్టీ నాయకులు సాయినగర్ బాషా అన్నారు. ఆదివారం మద్దికెరలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, డిసెంబరు 31: మండలంలోని మాధవరం తండా గ్రామంలో ఆదివారం కర్ణాటక మద్యం, సారాను స్వాధీనం చేసుకున్నారు. సుగాలి సూర్య నాయక్, సుగాలి హనుమంతు నాయక్, సుగాలిశివాజి నాయక్ అనే వ్యక్తుల దుకాణాల్లో మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు, పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. 29 బీరు సీసాలు, 17 సీసాలు మద్యం, 6 టెట్రా ప్యాకెట్లు, 5 లీటర్ల సారా పట్టుకున్నారు. అలాగే పొలాల్లో సారా స్థావరాలపై దాడులు చేసి 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసు కొని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపర్చగా ఆదోనికి రిమాండ్‌కు తరలించారు. ఏఎస్ఐ బందెనవాజ్, వీరాంజినేయులు, సోమశేఖర్, వీరాంజీ ఉన్నారు.



మునిసిపల్ కార్మికుల ధర్నా

ఆదోని (అగ్రికల్చర్) డిసెంబరు : మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎస్ఎంఆర్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పంప్‌హౌస్ దగ్గర మున్సిపల్ కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బీ రామాంజనేయులు, పీ ఈరన్న మాట్లాడుతూ, ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మునిసిపాలిటీలోని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, నీటి విభాగాలలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్‌యంఆర్‌ల సర్వీస్‌లను పరిగణనలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సీటు కోసం ఆరాటం సిగ్గుచేటు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 31: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి గురించి ఆలోచించకుండా రాజకీయ నాయకులు ఎమ్మెల్యే సీటుకోసం ఆరాటపడడం సిగ్గుచేటుగా ఉందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు, ప్రజలు, విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.



ట్రాక్టర్ల టైర్లు చోరీ

క్రిష్ణగిరి, డిసెంబరు 31: మండలంలోని కంబాలపాడు గ్రామ సమీపంలోని మంచి నీటి శుద్ధ జల కేంద్రానికి చెందిన ట్రాక్టర్‌ల నుంచి టైర్లను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్ ఆదివారం ఎస్ఐ సురేష్‌కు చోరీ గురించి ఫిర్యాదు చేశారు. కొద్ది రోజులుగా శుద్ధ జల కేంద్రం నుంచి తాగు నీటి సరఫరా ఆగిపోవడంతో ట్రాక్టర్‌లను, ట్యాంకర్‌లను శుద్ధ జలకేంద్రం వద్దే నిలిపి ఉంచారు. ఇదే అదునుగా భావించిన దుండగులు టైర్లను చోరీ చేశారు. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దస్తగిరి స్వామి ఉరుసు

తుగ్గలి, డిసెంబరు 31: హిందూ ముస్లిం ఐక్యంగా జరుపుకునే దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోతికొండలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా దస్తగిరి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



















